నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I హైదరాబాద్, శనివారం 1 ఫిబ్రవరి 2025 SIDDIPET


## కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



కేసీఆర్‌తో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, నాయకులు

నర్సాపూర్, జనవరి 31: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ఆప్యాయంగా పలుకరించి నర్సాపూర్ నియోజకవర్గ పరిస్థితులపై ఆరాతీశారు. నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలను ఓసారి కలవాలని కేసీఆర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేయగా, ఫిబ్రవరిలో కలుస్తానని చెప్పారు. వీరితో పాటు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్ ఉన్నారు.



హరీశ్‌రావుతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మున్సిపల్ మాజీ పాలకవర్గ సభ్యులు

## హరీశ్‌రావును కలిసిన నర్సాపూర్ నేతలు

నర్సాపూర్, జనవరి 31: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మున్సిపల్ మాజీ పాలకవర్గ సభ్యులతో కలిసి గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ..నర్సాపూర్ మున్సిపాలిటీ పాలకవర్గం పదవీ కాలం ఈనెల 26న పూర్తి కావడంతో పాలకవర్గ సభ్యులతో వెళ్లి కలిసినట్లు తెలిపారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, కౌన్సిలర్లను హరీశ్‌రావు శాలువాలతో సన్మానించారు. వీరి వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, పట్టణాధ్యక్షుడు భిక్షపతి, నాయకులు షేక్‌హుస్సేన్, శ్రీనివాస్ యాదవ్, ఆంజనేయులు గౌడ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ నుంచి భారీగా ఎర్రవల్లికి తరలివచ్చిన కార్యకర్తలు




జహీరాబాద్ నుంచి భారీగా తరలివచ్చి ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలుస్తున్న నాయకులు, కార్యకర్తలు

# సర్కారుపై దండయాత్ర

### సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పూర్తికి ప్రభుత్వంతో పోరాడుదాం

- పోరాడితేే తప్పా ఈ ప్రభుత్వం పట్టించుకోదు..
- జిల్లా మంత్రి ఏమి చేస్తుండు
- భూముల ధరలు సగానికి తగ్గినయి
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో కేసీఆర్‌ను కలిసిన మేదపల్లి బీఆర్ఎస్ కార్యకర్తలు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న దిగంబర్

గజ్వేల్, జనవరి 31: సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు బీఆర్ఎస్ హయాంలో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పనులకు టెండర్లు పిలిచామని, ఆ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని, పోరాడి ఎత్తిపోతలు పూర్తిచేయించుకుందామని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మేదపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయక్షేత్రానికి చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేసీఆర్ మాట్లాడారు. నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ ప్రాంతాలకు సాగునీళ్లు తేవాలని మల్లన్నసాగర్ నుంచి సింగూర్‌కు గోదావరి జలాలను లిఫ్ట్‌చేసి, అక్కడి నుంచి సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ద్వారా నీరందించి సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసుకోవాలనే లక్ష్యంతో పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కారు రాగానే ఆ పనులు నిలివేసిందని విమర్శించారు. ప్రజలను సమీకరించి హరీశ్‌రావు నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం చేయాలని సూచించారు. ఈ ఎత్తిపోతలు పూర్తయితే నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గ రైతులకు మేలు జరుగుతుందని, జిల్లా మంత్రి ఏమి చేస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం మెడలు వంచి ఎత్తిపోతలు పూర్తిచేసుకోవాలంటే పోరాటానికి సిద్ధం కావాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. పోరాటాలు చేయాల్సిందేనని, కొట్లాడితే కాని ఈ ప్రభుత్వం దిగి రాదన్నారు. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసమని, తెలంగాణ రాష్ట్రం సాధించి, వచ్చిన తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తే, ఈ దరిద్రులు వచ్చి నాశనం పట్టిస్తున్నారని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై పోరాటాలకు అవసరమైన సందర్భంలో పార్టీ జిల్లాశాఖ పిలుపునిస్తదని, రాష్ట్రంలో తాను పిలుపునిస్తానని, అందులో అందరూ పాల్గొనాలని కేసీఆర్ కోరారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రం సాధిస్తే తప్పా ఈ గడ్డకు విముక్తి రాదని, ఈ రైతులు బాగుపడరని, ఆరునూరైనా తెలంగాణ తెచ్చుకోవాలనే నిర్ణయానికి వచ్చి గవర్నమెంట్ ఇంట్లో ఉండవద్దనే నిర్ణయంతో రంగారెడ్డి జిల్లాలో ఉన్న భూమి అమ్మి బంజారాహిల్స్‌లో ఇల్లు కొంటే కొంత డబ్బు మిగిలిందని కేసీఆర్ గుర్తుచేశారు. ఆ డబ్బుతో జహీరాబాద్ ప్రాంతంలోని మొగుడంపల్లిలో అన్ని మామిడి తోటలు ఆంధ్రావాళ్లవి చూసిన తరువాత ఆరునూరైనా తెలంగాణ సాధించాలనే మొండిగా బలమైన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆనాడు అక్కడ చూసిన వ్యవసాయభూములు ఆంధ్రా వాళ్ల చేతిలో ఉండడం చూసి మనవాళ్ల కోసం తెలంగాణ సాధించాలనే పోరాటం చేశానన్నారు. అప్పటి ప్రభుత్వాలు కరెంట్ విషయంలో ఎంతో అవహేళనగా మాట్లాడాయని, టాన్స్‌ఫార్మర్లు కాలిపోవుడు, లం చాలు ఇచ్చుడు గుర్తు చేసుకుంటే కళ్లతో నీళ్లు వస్తాయని ఎంతో బాధపడ్డామని కేసీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. రైతులు పరిస్థితిని చూసి రైతుబంధు, రైతుబీమాను తీసుకొస్తే అన్నదాతలు ఎంతో సంతోషపడ్డారన్నారు. కష్టకాలంలో రైతుల కోసం నాలుగైదు సంక్షేమ పథకాలను తెచ్చి అమలు చేసినట్లు గుర్తుచేశారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీళ్లు అందించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలోనే వ్యవసాయ భూముల ధరలు సగానికి సగం పడిపోయాయని, రైతుల పరిస్థితి ఆగమైందని కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు చంద్రాగౌడ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

**ఐదు రోజులు 140 కిలోమీటర్లు...**

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మేదపల్లికి చెందిన పరమేశ్వర పాటిల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన పాదయాత్ర వందమందితో శుక్రవారం మధ్యాహ్నం మర్కూక్ మండలం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంది. ఐదు రోజుల పాటు 140 కిలో మీటర్ల పాదయాత్ర కొనసాగింది. ఈ పాదయాత్రకు ఆయా గ్రామాల ప్రజలకు ఘనస్వాగతం పలికారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలకు ఎలాంటి లాభం చేకూరలేదని పాదయాత్ర బృందానికి ప్రజలు తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి వేలాది కార్యకర్తలు వ్యవసాయక్షేత్రానికి తరలివచ్చారు. ఎంతో ఆప్యాయంగా అందరినీ పలకలించి కేసీఆర్ వారితో ఫొటోలు దిగారు. అక్కడికి వచ్చిన కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. ఝరాసంగం మండలానికి చెందిన కేసీఆర్ అభిమాని దిగంబర్ కేసీఆర్‌కు చిత్రపటాన్ని అందజేశారు.

### ప్రజల అభిప్రాయాలు తెలిపాం..



ఐదు రోజులుగా కొనసాగిన పాదయాత్రలో ప్రజలు మాదృష్టికి తెచ్చిన సమస్యలను కేసీఆర్‌కు వివరించాం. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు పడతున్న ఇబ్బందులు, గ్రామాల్లోని పరిస్థితిని తెలియజేశాం. తెలంగాణ ప్రదాత కేసీఆర్‌ను దగ్గరగా కలవడంతో ఎంతో సంతృప్తిగా ఉంది. కేసీఆర్ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉండేవారు.

– పరమేశ్వర పటేల్, మాజీ సర్పంచ్

### ఉద్యమకాలం నుంచి కేసీఆర్‌తోనే..



ఉద్యమకాలం నుంచి కేసీఆర్‌తోనే ఉన్నా. ఆయనతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైంది. నా 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి దౌర్భాగ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజా సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తే బాగుంటుంది.

– చంద్రప్ప, మాజీ సర్పంచ్



పాదయాత్రగా వస్తున్న మేదపల్లి కార్యకర్తలు



హుస్నాబాద్ టౌన్: సన్మాన కార్యక్రమంలో కేటీఆర్‌తో మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

## మాజీ చైర్‌పర్సన్‌కు కేటీఆర్ సన్మానం

హుస్నాబాద్ టౌన్, జనవరి 31: హుస్నాబాద్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్నను శుక్రవారం హైదరాబాద్ బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్ ఘనంగా సన్మానించారు. ఐదేండ్లపాటు మున్సిపాలిటీకి సేవలందించినందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. బీఆర్ఎస్ హయాంలో హుస్నాబాద్‌ను అభివృద్ధి పథంలో నడిపారని వారిని అభినందించారు.

## పరిశోధనల్లో ఐఐటీహెచ్ భేష్

**కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్**



కందిలోని ఐఐటీహెచ్‌లో కేరళ గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, జనవరి 31: ఆవిష్కరణలు, పరిశోధనల్లో ఐఐటీ హైదరాబాద్ ముందున్నదని కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌ను కేరళ గవర్నర్ సందర్శించారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి గవర్నర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి ఐఐటీహెచ్‌తో భాగస్వామ్య అవకాశాలను గవర్నర్‌కు కలెక్టర్ వివరించారు. ఐఐటీహెచ్‌లో నూతన పరిశోధనలు, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, ఐఐటీ నుంచి ప్రభుత్వ రంగ అభివృద్ధికి తోడ్పాటు వంటి విషయాలను డైరెక్టర్ బీఎస్ మూర్తి వివరించారు. ఐఐటీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్‌లో అత్యాధునిక పరిశోధనలు, స్టార్టప్ సహకారాలు, పరిశ్రమలతో భాగస్వామ్యాలను తెలియజేశారు. ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ ఫ్యూయల్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఐఐటీ చేస్తున్న పరిశోధనల ప్రాముఖ్యతను గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఐఐటీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో సాగాలని, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు ప్రోత్సహించేందుకు ప్రభుత్వ సహాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ సత్తయ్య, కంది తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లకు రూ.10 కోట్లు మంజూరు



పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక, జనవరి 31: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో పలు రోడ్లకు రూ.10.51 కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో మట్టి రోడ్లను బీటీగా మార్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.40 కోట్లు మంజూరు కాగా, ఆ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. ఆ నిధులను మంజూరు చేయాలని మంత్రి సీతక్కను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పలుసార్లు కోరారు. దుబ్బాక నియోజకవర్గంలోని 5 రోడ్లను పంచాయతీరాజ్ శాఖ ద్వారా 28 కి.మీ మేర బీటీగా మార్చేందుకు రూ.10.51 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో దుబ్బాక మండలంలో మెదక్ పీడబ్ల్యూ రోడ్డు నుంచి ధర్మాజీపేట, రామక్కపేట చౌరస్తా వరకు రూ.2.24 కోట్లు, అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని చిట్టాపూర్, మోతె, కాసులాబాద్ రోడ్డుకు రూ.3.43 కోట్లు,వీరారెడ్డిపల్లి,జంగపల్లి,దౌల్తాబాద్ రోడ్డుకు రూ. కోటి, తొగుట మండలం తుక్కాపూర్ నుంచి కాన్గల్ వరకు రూ.1.66 కోట్లు, వరదరాజుపల్లి నుంచి మర్రికుంట రోడ్డుకు రూ.2.16 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా దుబ్బాక అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిధుల మంజూరుపై నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## భూసర్వేను అడ్డుకున్న బాధితులు

చిన్నశంకరంపేట, జనవరి 31: తాతముత్తాతల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుంటే ఎవరో వచ్చి ఈ భూమి తమదంటే ఊరుకునేది లేదని సర్వేకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. చిన్నశంకరంపేట మండలంలోని కామారంతండాలో సర్వేను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. తండాకు చెందిన కేతావత్ హరినాయక్, శక్రునాయక్‌లకు సర్వేనెంబర్ 147,158,141,144లో నాలుగు ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిని 2007లో దాట్ల వెంకటరామరాజు కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శుక్రవారం దాట్ల వెంకటరామరాజు హద్దుల కోసం జిల్లా సర్వేయర్ ఏడీ శ్రీనివాస్, ఎస్సై నారాయణ, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహిస్తుండగా రైతులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. వెంకటరామరాజు దొంగ సంతకాలు సృష్టించి నకిలీ పత్రాలతో భూమిని లాక్కోవాలని చూస్తున్నాడని అధికారులకు మొర పెట్టుకున్నారు. భూమిని కొన్నానని అన్ని పత్రాలతో కోర్టుకు కూడా వెళ్లినట్లు వెంకటరామరాజు తెలిపారు. పోలీసులు సర్ధి చెప్పడంతో అధికారులు వెళ్లిపోయారు.



కామారంతండాలో ఇద్దరితో మాట్లాడుతున్న ఎస్సై నారాయణ



నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది పీహెచ్‌సీని పరిశీలిస్తున్న వైద్య బృందం

## పీహెచ్‌సీని సందర్శించిన వైద్య బృందం

నారాయణరావుపేట, జనవరి 31: నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ పబ్లిక్ హెల్త్ ఫెసిలిటీస్ ప్రజల నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయబడ్డాయా..లేదా అనే అంశాలపై మండలంలోని గుర్రాలగొంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్‌ను జాతీయ నాణ్యతాప్రమాణాల పర్యవేక్షకులు డాక్టర్ దీపక్ నాందేవ్ డోగ్రే (మహారాష్ట్ర), జె.దినేశ్‌కుమార్(తమిళనాడు), జిల్లా ఆరోగ్య శాఖ అధికారి పల్విన్ కుమార్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్‌లో అందుతున్న సేవలు జాతీయ ప్రమాణాలకు, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలకు అనుకూలంగా ఉన్నాయో పరిశీలించారు.ఎన్‌క్యూఎస్ ప్రమాణాలు నిర్ణయించిన నాణ్యతను అంచనా వేసి ప్రజలకు సౌకర్యాలను అందుబాటులోకి తేవడం ఈ పర్యవేక్షణ ముఖ్యఉద్దేశమని వారు తెలిపారు. మెరుగైన సేవలు, క్లినికల్ కేర్ ఇన్ఫెక్షన్, కంట్రోల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ వంటివి ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలనే ఉద్దేశంతో పర్యవేక్షణ చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి అరుణ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రేవతి, స్టేట్ క్వాలిటీ అసోసియేషన్స్ అధికారి రాధిక ఉన్నారు.

## ప్రత్యేకాధికారుల చేతుల్లో పాలన

**ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్, జనవరి 31: రాష్ట్రంలో సర్పంచ్‌లు, ఎంపీటీలు, మున్సిపల్ చైర్మన్లు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్మన్లు లేక ప్రత్యేకాధికారుల పాలనలో రాష్ట్రం రాజ్యామేలుతున్నదని, ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి స్థానిక ఎన్నికలు నిర్వహించడంలో ఆలస్యం చేస్తున్నదన్నారు. దీంతో పాలన ప్రత్యేకాధికారుల చేతిలోకి వెళ్లినట్లు తెలిపారు. తెలంగాణలో పరోక్షంగా ప్రెసిడెంట్ రూల్ నడుస్తున్నదని, రేవంత్‌రెడ్డికి పాలన చేతకాక అధికారుల చేతిలో పెట్టారని విమర్శించారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిలో శూన్యమని, కేసీఆర్ తెచ్చిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఛీకొడుతున్నారని, ఎన్నికలు పెడితే కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోతుందని వంటేరు ప్రతాప్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఓడిపోతామనే భయంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని విమర్శించారు.



దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ ఎస్సీకాలనీలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు



గాడిచర్లపల్లిలో మోటర్ కాలిపోవడంతో ఆగిపోయిన నాటు

## కరెంటు కష్టాలు షురూ..



గాడిచర్లపల్లిలో కాలిపోయిన మోటర్‌ను తీస్తున్న రైతులు

మళ్లీ కరెంట్ కష్టాలు మొదలు కావడంతో రైతులు దిగులు చెందుతున్నారు. తరుచూ కరెంట్ వస్తూపోతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో 24గంటల పాటు నాణ్యమైన కరెంట్ సరఫరా అయ్యేది. లోవోల్టేజీ, కరెంట్ ట్రిప్ కావడం వంటి సమస్యలు అప్పుడు రైతులకు ఎదురుకాలేదు.ప్రస్తుతం నాణ్యమైన కరెంట్ సరఫరా కాకపోవడంతో బోరు మోటర్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. సిద్దిపేట జిల్లా గాడిచర్లపల్లిలో ఒక పంట పండకుండానే మూడు నాలుగు సార్లు మోటర్లు రిపేర్ చేయించాల్సి వస్తున్నదని రైతులు వాపోయారు.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా

## పిల్లలతో పనిచేయిస్తే చర్యలు

**మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి**



మెదక్ అర్బన్, జనవరి 31: పిల్లలతో పనిచేయిస్తే చర్యలు తీసుకుంటామని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్‌లో మాట్లాడారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీ నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్–11 నిర్వహించినట్లు తెలిపారు. వివిధ కారణాలతో బడి మానేసి దుకాణాలు, కర్మాగారాలు, ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న 122 మంది పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు, యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. తల్లిదండ్రులకు ఆ పిల్లలను పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల పిల్లలను తల్లిదండ్రులు వచ్చే వరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిపే సంరక్షణ కేంద్రాల్లో ఉంచామని, వారు వచ్చిన తర్వాత అప్పగిస్తామన్నారు. ఆపరేషన్‌లో 28 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు.

## మొదలైన తాగునీటి కష్టాలు

- 20 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్
- ఖాళీ బిందెలతో ఇందుప్రియాల్ ఎస్సీ కాలనీవాసుల నిరసన

రాయపోల్, జనవరి 31: వేసవి రాకముందే తాగునీటి కష్టాలు ఎదురవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇంద్రుప్రియాల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో 20 రోజులుగా తాగునీరు రాకపోవడంతో కాలనీ వాసులు పడరాని పాట్లు పడుతున్నారు. తమ కాలనీకి మిషన్ భగీరథ నీరు రావడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో శుక్రవారం రోడ్డుపై బైఠాయించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. 20 రోజులుగా తాగునీరు రాక బిందెడు నీటి కోసం బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. మిషన్ భగీరథ అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇందుప్రియాల్ ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.